# మన బడి.. వసతుల ఒడి..

- ఫలితాన్నిస్తున్న మన ఊరు-మన బడి కార్యక్రమం
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- అందుబాటులోకి నాణ్యమైన విద్య, మౌలిక వసతులు
- జిల్లావ్యాప్తంగా తొలి విడుతలో 371 స్కూళ్లలో పనులు
- 41 బడుల్లో పూర్తైన పనులు.. ప్రారంభం


తాండూరు మండలంలోని గౌతాపూర్ ప్రాథమిక పాఠశాల



ఇబ్రహీంపట్నం మండలంలోని నోముల ప్రభుత్వ పాఠశాల


కడ్తాల్ మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల



చేవెళ్ల : తంగడపల్లిలోని ప్రాథమిక పాఠశాల


రంగారెడ్డి జిల్లాలోని కొత్తపేట జడ్పీహెచ్‌ఎస్


వికారాబాద్ : దుద్యాల మండలంలోని చెట్టుపల్లితండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల



'మన ఊరు – మన బడి'తో రూపురేఖలు మారిన చేవెళ్ల మండలంలోని కందవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల


వికారాబాద్ : మన్నేగూడలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు



రంగారెడ్డి జిల్లాలోని కొత్తపేట జడ్పీహెచ్‌ఎస్‌లోని డైనింగ్ హాల్



వికారాబాద్: దోమ మండలంలోని శివారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల భవనం



మొయినాబాద్ : హిమాయత్‌సాగర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్


వికారాబాద్ జిల్లాలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో డ్యూయల్ డెస్క్‌లపై కూర్చుని పాఠాలు వింటున్న విద్యార్థులు

వికారాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ విద్యారంగాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. కేజీ టూ పీజీ ఉచిత నాణ్యమైన విద్యనందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనివ్వడంతోపాటు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా సర్కార్ బడులను తీర్చిదిద్దుతున్నారు. గతేడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధనను ప్రారంభించడంతోపాటు విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫాంలను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారు.

### మన ఊరు-మన బడితో సమూల మార్పులు..

ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన మన ఊరు–మన బడి కార్యక్రమంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. సర్కారు స్కూళ్లలో సకల వసతులు కల్పిస్తుండడంతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపుదిద్దుకుంటున్నాయి. మొదటి విడుతలో మండలం, మున్సిపాలిటీల నుంచి రెండు చొప్పున ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అవసరమైన మౌలిక వసతులను కల్పించారు. జిల్లావ్యాప్తంగా మొదటి విడుతలో ఎంపికైన 371 స్కూళ్ల లో ఇప్పటికే 41 బడుల్లో 12 రకాల వసతులను కల్పించి కార్పొరేట్ లుక్ తీసుకురాగా.. ఆ బడులను అధికారులు ఇప్పటికే ప్రారంభించడం కూడా పూర్తైంది. మిగతా బడుల్లో 50 శాతానికి పైగా పనులు పూర్తి కాగా మిగిలిన పనులు చురుగ్గా జరిగేలా అధికారులు చర్యలను ముమ్మరం చేశారు. మన ఊరు– మన బడిలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్లు, విద్యుత్తు, గ్రీన్ చాక్‌బోర్డులు, పెయిటింగ్, ప్రహరీలు, కిచెన్ షెడ్లు, శిథిలమైన తరగతి గదుల స్థానంలో నూతన గదుల నిర్మాణం, డిజిటల్ విద్యకు అవసరమైన ఏర్పాట్లు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్లు తదితర 12 రకాల వసతులను కల్పిస్తున్నారు. అయితే జిల్లావ్యాప్తంగా 1054 ప్రభుత్వ పాఠశాలలుండగా వీటిలో మొదటి విడుతలో 371 స్కూళ్లలో అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొదటి విడుతలో ఎంపిక చేసిన స్కూళ్లలో ఉన్నత పాఠశాలలు–111, ప్రాథమికోన్నత పాఠశాలలు–40, ప్రాథమిక పాఠశాలలు–220 పాఠశాలలున్నాయి. జిల్లావ్యాప్తంగా మొదటి విడుతలో ఎంపికైన 371 బడుల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.144 కోట్ల నిధులను విడుదల చేసింది.


వికారాబాద్ జిల్లాలోని శివారెడ్డిపేట్ జిల్లా పరిషత్ హైస్కూల్


వికారాబాద్ : పూడూరు మండలంలోని జడ్పీహెచ్‌ఎస్


వికారాబాద్ : మన్నేగూడ పాఠశాలలో ఏర్పాటైన హ్యాండ్ వాష్..

### ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు



సీఎం కేసీఆర్ ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చింది. మన ఊరు–మన బడి కార్యక్రమంతో బడుల రూపురేఖలను మార్చుతున్నది. మా పాఠశాలలో మంచి నీటి, విద్యుత్తు, వంట గది, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, గ్రీన్‌చాక్ బోర్డు ఏర్పాటుతోపాటు పాఠశాలకు కలర్ వేయడం జరిగింది. దీంతో స్కూల్ నూతన శోభను సంతరించుకున్నది. ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు.

**-ధనుంజయ్యగౌడ్, ఉపాధ్యాయుడు, కడ్తాల్ మండలం**

### మంచి బోధన అందుతున్నది..

శివారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో గతంలో కంటే వసతులు మెరుగయ్యాయి. ఉపాధ్యాయులు చాలా బాగా బోధిస్తున్నారు. అన్ని రకాల వసతులుండడంతో ప్రైవేట్ స్కూళ్ల నుంచి నా స్నేహితులు ఇక్కడికొచ్చి చేరుతున్నారు. టీచర్లు స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబం ధించిన నైపుణ్యాలనూ చెబుతున్నారు.

**–సాయితేజ, 5వ తరగతి, శివారెడ్డి పల్లి పాఠశాల, దోమ మండలం**



### పాఠశాలలకు మహర్దశ



మన ఊరు–మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ బడులకు మహర్దశ వచ్చింది. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు పాఠశాలల్లో వసతులు మెరుగవుతున్నాయి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూరుతుండడంతో ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చి విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరుతున్నారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే సీఎం కేసీఆర్ సంకల్పం గొప్పది.

**-రాజశేఖర్, ప్రధానోపాధ్యాయుడు, శంకర్‌పల్లి**

### సీఎం బ్రేక్‌ఫాస్ట్‌తో పెరిగిన హాజరు శాతం



సీఎం అల్పాహార పథకంతో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరుగడంతోపాటు డ్రాప్‌అవుట్ల సంఖ్య తగ్గింది. ఇప్పటికీ ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చి విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరుతున్నారు. మన ఊరు –మన బడి కార్యక్రమం ప్రభుత్వ రూపురేఖలను ఎంతో మార్చుతున్నది. ప్రభుత్వ బడులు కార్పొరేట్‌కు దీటుగా మారుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**-ఉమారాణి, గౌతాపూర్ పాఠశాల హెచ్‌ఎం**

### ప్రైవేట్‌ను వదిలి..సర్కారు బడుల వైపు..




బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మన ఊరు–మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు ఎంతో మారుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా వసతులను కల్పిస్తుండటంతో ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు సర్కారు బడులకు తిరిగి వస్తుండటంతో హాజరు శాతం కూడా పెరుగుతున్నది. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతున్నది.

**- రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, నోముల**

### ఓ అద్భుత కార్యక్రమం..

మన ఊరు–మన బడి ఓ అద్భుత కార్యక్రమం. దీని ద్వారా ప్రభుత్వ బడుల్లో సకల సౌకర్యాలు సమకూరుతున్నాయి. శిక్షణ పొందిన టీచర్లతో స్టూడెంట్లకు నాణ్యమైన విద్య అందుతున్నది. **-అక్బర్, ఉపాధ్యాయుడు, చేవెళ్ల**




రంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లి మండలంలోని టంగటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల